## రోడ్డు ప్రమాదంలో వ్యాపారవేత్త గట్టు రవి మృతి

**సిద్దిపేట రూరల్, మార్చి 9, ప్రభాతవార్త :** సిద్దిపేటలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వ్యాపారవేత్త, వైశ్య సంఘం మాజీ అధ్యక్షులు గట్టు రవి మరణించారు. సిద్దిపేట నర్సాపూర్ చౌరస్తా సమీపం లోని కెసిఆర్‌నగర్ సమీపంలో ఫంక్షన్‌కు హాజరై భార్య అరుణతో కలిసి రవి బైక్ వస్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన మరో బైక్ ఢీ కొట్టడంతో ఆయన మృతి చెందారు.

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు దిగ్భ్రాంతి**

గట్టు రవి మృతిపట్ల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సాను భూతిని ప్రకటించారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ రవి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి కుటుంబీకులకు సంతాపం తెలియజేశారు. రోడ్డు ప్రమాదంలో గట్టు రవి మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహా సభ కార్యదర్శి గంప శ్రీనివాస్ బాధకరమన్నారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవాలు నిర్వహించడంలో రవీందర్ ఎప్పుడు ముందుండేవారని తెలిపారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య

**వర్గల్, మార్చి 9 (ప్రభాతవార్త):** తల్లి మందలించడంతో పురుగులమందు తాగి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వర్గల్ మండలం చాంద్‌ఖాన్‌మక్త గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చాంద్‌ఖాన్‌మక్త గ్రామానికి చెందిన మర్కంటి కనకవ్వ, గోపాల్‌రెడ్డిలకు కుమారుడు మర్కంటి విజయేందర్‌రెడ్డి(16) ఉండగా చౌదరిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 6వ తేదీన కనకవ్వ తమ వ్యవసాయ పొలంలో ఉన్న సమయంలో ఆమె కుమారుడు అక్కడికి రావడంతో కనకవ్వ చదువుకోకుండా పొలం వద్దకు ఎందుకు వచ్చావని మందలించడంతో పొలం వద్ద ఉన్న పురుగుల మందును తాగాడు. ఇది గమనించిన అతని తల్లి సమీపంలో ఉన్న వారి సహాయంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైద్రాబాద్‌లోని బేగంపేట్ సన్‌షైన్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 9వ తేదీ అర్థరాత్రి 1 గంట సమయంలో మృతిచెందాడు. మృతుని తల్లి కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం కుటుంబీకులు

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నా

### మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**కొమురవెల్లి, మార్చి 9, ప్రభాతవార్త :** ప్రకృతి సహకరించి మంచి సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని మల్లికార్జునస్వామిని వేడుకున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వామి వారి దయతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఎలాంటి అటంకం లేకుండా మల్లన్న ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్‌తో పాటు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఈనెలలో అందించడం జరుగుతుందన్నారు. త్వరలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా అందించినట్లు వివరించారు. మండల మహిళా సమైక్య ద్వారా 600 బస్సులు వస్తున్నాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు శాసనసభలో చట్టబద్ధత కల్పించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి కృషిచేస్తున్న సర్కార్‌కు అందరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, ధర్మకర్తలు, నాయకులు ఉన్నారు.

## మల్లన్న నామస్మరణతో మార్మోగిన దేవాలయం



భక్తులతో కోలాహలంగా మారిన మల్లన్న ఆలయం

**కొమురవెల్లి, మార్చి 9, ప్రభాతవార్త :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ఆదివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయం మల్లన్న నామస్మరణతో మార్మోగింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బలిజే మేడలమ్మ, గొల్ల కేతమ్మ, గుట్టపై ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకొని పట్నాలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. గంగిరేగు చెట్టువద్ద ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకోవడంతో పాటు కొరికలు తీర్చాలని స్వామివారిని వేడుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రామాంజనేయులు తగు ఏర్పాట్లు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించారు.

## నేడు ప్రజావాణి : జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందునీ ఈ నెల 10న కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## జయమ్మకు రాష్ట్ర ఆదర్శ మహిళా అవార్డు




జయమ్మకు ఆదర్శ మహిళా అవార్డు అందజేస్తున్న ఐఏఎస్ రజినిప్రియ

**జగదేవ్‌పూర్, మార్చి 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన కొన్నె జయమ్మ ముదిరాజ్ ఆదివారం హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఐఏఎస్ ఆఫీసర్ రజినిప్రియ, ఎంబి.చౌదరి చేతులమీదుగా రాష్ట్ర ఆదర్శ మహిళా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమను గుర్తించి రాష్ట్ర ఆదర్శ మహిళా అవార్డును అందించడం ఎంతో గర్వంగా ఉందని, మహిళల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాగుల రాజు, మండల ఉపాధ్యక్షుడు పిట్టల నర్సింలు, ధర్మారం గ్రామ మాజీ సర్పంచ్ పిట్టల రాజు, మండల యూత్ ప్రధాన కార్యదర్శి తీగుళ్ల బాలకిషన్, ముదిరాజ్ నాయకులు అన్నెపు దాసు తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మను దర్శించుకున్న అదనపు కలెక్టర్

**పాపన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయాన్ని ఆదివారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్ నగేష్‌ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా అదనపు కలెక్టర్ నగేష్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అదనపు కలెక్టర్‌కు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేసి శాలువాతో సత్కరించారు.

## రూ. 35 లక్షలతో కొత్త విద్యుత్ లైన్

### చీఫ్ ఇంజనీర్ బాలస్వామి

**పాపన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు 35లక్షల రూపాయలతో కొత్త విద్యుత్‌లైన్‌ను వేస్తున్నట్లు విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి పేర్కొన్నారు. పొడిచన్‌పల్లి ఫీడర్‌లో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా కొత్తపల్లి, గాంధిరిపల్లి, పొడిచన్‌పల్లి, నాగసాన్‌పల్లి ఉపకేంద్రాల్లో అంతరాయం ఏర్పడుతోందని, సమస్య పరిష్కారానికి 35లక్షల రూపాయలతో కొడిపల్లి నుంచి 33కెవి లైన్ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాలస్వామి వెంట ఎస్ఈ శంకర్, డీఈ చాంద్‌పాషా, ఏడిఈ శ్రీనివాస్, మోహన్‌బాబు, ఏఈ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**హవేళిఘనపూర్, మార్చి 9,ప్రభాతవార్త:**

వసతి గృహాల్లోని భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం హవేలీ ఘనపూర్ మండలంలో మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల బాలికల రెసిడెన్షియల్ స్కూల్ కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. రోజువారి మెనూ అమలు చేయాలని వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న మెనుపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి ఎలాంటి ఆహారం అందిస్తున్నారు ? ఏమైనా సమస్యలున్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలకి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, శుభ్రతతో కూడిన పోషకాహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాలల్లోని వంట గదిని పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే వంట సరకులను నిల్వ చేసే గదిని తనిఖీ చేసి, పప్పులను, వంట నూనె, బియ్యాన్ని, కూరగాయలు, ఆకుకూరలు, తదితరాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అలాగే మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రయోగశాలలు, తరగతి గదులను తనిఖీ చేసి, నిత్యం పరిశుభ్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల హాజరు రిజిస్టర్, సరకుల నిల్వ రిజిస్టర్, వార్డెన్స్ హాజరు రిజిస్టర్, తదితరాలను తనిఖీ చేసి, ఈ రిజిస్టర్లలో వివరాలను సరైన విధంగా నమోదు చేయాలని, వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులతో మమేకమై మాట్లాడి, ఎక్కడ నుంచి వచ్చారు? ఎలా చదువుతున్నారు? ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని సమయానికి అందిస్తున్నారా? వంటి వివరాలను అడిగి తెలుసుకుంటూ, వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించి, చక్కగా చదువుకొని ఉన్నత విలువలతో తమ లక్ష్యాలను సాధించాలని మార్గనిర్దేశం చేశారు.



భోజన సమయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

# నక్కవాగు నుంచి మంజీరా జలాలను రక్షించాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్

**చౌటకూరు, మార్చి 9, ప్రభాతవార్త:** నక్కవాగు వెదజల్లుతున్న కాలుష్యాపు జాలాలతో మంజీర జలాలు కలుషితం అవుతున్నాయని, నక్కవాగు నుంచి మంజీర జలాలను రక్షించాల్సిన అవసరం ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ అన్నారు. మండల పరిధిలోని ఏటిగడ్డ లింగంపల్లి గ్రామంలో ఆదివారం ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు సిపిఎం నాయకులు పర్యటించారు. గ్రామ శివారులో ప్రవహిస్తున్న మంజీరా నదిని గ్రామస్తులతోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ నక్కవాగు వెదజల్లుతున్న కాలుష్యం మంజీరాలోకి చేరుకోవడంతో మంజీరా పూర్తిగా కలుషితమైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏరు మీద చెక్‌డ్యాం కట్టడంతో నీరు నిల్వ ఉండటం, టుంగా గుర్రపు డెక్కలు, పిచ్చి మొక్కలతో నది పూర్తిగా నిండిపోవడంతో పరిసరాలు దుర్గంధంగా మారిపోయాయని, దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని మంచాల బాటపట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూగ జీవాలు సైతం నీటిని సేవించే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో భూగర్భ జలాలు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నక్కవాగు నీరు మంజీరాలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏటిగడ్డ లింగంపల్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను(రైతు భరోసా డబ్బులు, 2 లక్షల పంట రుణాల మాఫీ, రేషన్ కార్డులు, ఫించన్లు, ధరణి భూ సమస్యలు) ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఎస్సీ బస్తీలో కరెంటు తీగలు తెగిపడిపోయే పరిస్థితి ఉందని, విద్యుత్ తీగలను సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. పాఠశాల భవనం శిథిలావస్థలకు చేరుకుందని, పాఠశాల గేటు వద్ద మురుగుకాల్వపై ఏర్పడిన పెద్దరంధ్రాన్ని మూసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, శ్రీశైలం, ప్రజా సంఘాల నాయకులు రాజు, శ్రీహరి, సురేష్, రైతులు దుర్గయ్య, పోచయ్య, కిష్టయ్య, మల్లేశం పాల్గొన్నారు.



మంజీరా నదిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



సుడు సూడే పిల్లో రాధమ్మ పాటకు సూచనలిస్తున్న దర్శకుడు శ్రీశైలం

## నర్సాపూర్‌లో షూటింగ్ సందడి

**నర్సాపూర్, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గూడెం గడ్డ గ్రామంలో సుడు సూడేపిల్లో రాధమ్మ అనే ఫోక్‌సాంగ్ సిరిమువ్వలు బ్యానర్ పై చిత్రీకరించిన షూటింగ్ సందడిగా నెలకొంది. నర్సాపూర్ ప్రాంతానికి చెందిన నీరుడి శ్రీశైలం సొంత బ్యానర్‌పై చిత్రీకరిస్తున్న సిరిమువ్వలు అనే యూ ట్యూబ్ ఛానల్ ద్వారా సుడు సూడే పిల్లో రాధమ్మ అనే పాటను శనివారం నర్సాపూర్ పరిసర ప్రాంతాలతో పాటుగా,గూడెం గడ్డ గ్రామంలో పాటను చిత్రీకరించారు. పాట చిత్రీకరణ సందర్భంగా గూడెం గడ్డలో షూటింగ్ సందడి నెలకొన్నది. ఈ షూటింగ్ సందడి కి గ్రామస్తులు యువతీ యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు.

## కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

**నర్సాపూర్, మార్చి 9, ప్రభాతవార్త :** గుమ్మడిదల మండలం ప్యారానగర్ లో నిర్మిస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా ఆదివారం ఆశన్నగారి దేవేందర్‌యాదవ్, మహేష్‌గౌడ్, దయానంద్ నరేందర్‌చారి, సదానంద్‌చారి డంపింగ్ యార్డ్ హఠావో నర్సాపూర్‌కో బచావో అంటూ నినాదాలు చేస్తూ రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపుయార్డు నిలిపివేసేవరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డంపింగ్ యార్డ్ నిర్మాణాన్ని నిలిపి వేయాలని వారుడిమాండ్ చేశారు. దీక్షలో పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




రిలే నిరాహార దీక్షలో కూర్చున్న అఖిల పక్షం నాయకులు

# కెసిఆర్‌ను ప్రశ్నించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదు

### -మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్ టౌన్, మార్చి 9 (ప్రభాతవార్త):**

గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ప్రశ్నించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి అన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం మాట్లాడితే అధికారంలో ఉండి చేసేది చేతగాక కెసిఆర్‌ను విమర్శించడం మూర్ఖత్వమన్నారు. 2014కి ముందు దశాబ్దాల పాటు గజ్వేల్ నియోజకవర్గం పాలించిన కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గానికిచేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో పేరుకుపోయిన దశాబ్దాల సమస్యలను, మౌలిక అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపిన దార్శనికుడు కెసిఆర్ అని, గజ్వేల్‌కు రైల్వే లైన్, తాగునీరు, సాగునీరు, జిల్లా ఆసుపత్రి, ఎడ్యుకేషన్ హబ్, ఔటర్ రింగ్‌రోడ్డు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేసిన ఘనత కెసిఆర్‌దే అన్నారు. మీ పాలనలో కనీసం తాగడానికి నీళ్లిచ్చిన పాపాన పోలేదని, గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్నపూర్ణగా మార్చేందుకు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లను నిర్మించారని అన్నారు. కెసిఆర్ చేసిన గొప్ప కార్యక్రమాలను మరిచిపోయి అక్కడక్కడ కోర్టు కేసులతో చిన్న చిన్న కారణాలతో మిగిలి పోయిన పనులను చూపించి కోడిగుడ్డుమీద ఈకలు పీకినట్టు విమర్శలు చేస్తున్నారని అన్నారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితుల పట్ల కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. గతంలో నిర్వాసితుల వద్దకు వచ్చి రెచ్చగొట్టే ఉపన్యా సాలు ఇచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు నిర్వాసితులను ఎందుకు మరిచిపోయారో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్చీల కోసం పోటీపడి మరీ గొడవలు పడుతున్నారు తప్ప ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేయడం లేదన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఇంకా రైతు రుణమాఫీ కాని రైతులు వేలాది మంది ఉన్నారని అన్నారు. రైతు భరోసా, రైతుబీమాను సకాలంలో అందించే ప్రయత్నం చేయాలని, కళ్యాణలక్ష్మి అందక ఆడపిల్లల తల్లి దండ్రులు ఎదిరిచూస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో మళ్ళీ కెసిఆర్ ముఖ్య మంత్రి కావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ కౌన్సిలర్లు బొగ్గుల చందు, మర్కంటి కనకయ్య, మామిడి శ్రీధర్, మల్లేశం, నాయకులు రమేష్‌గౌడ్, ఉమర్, నిజామొద్దీన్, శివకుమార్, హనుమంత రెడ్డి, అక్రమ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్, ఎన్‌సి.రాజమౌళి



ప్రథమ బహుమతి అందుకుంటున్న మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు

## నేషనల్ ఇంటిగ్రిటీ క్యాంప్‌లో మహిళా డిగ్రీ కళాశాలకు మొదటి బహుమతి

**వర్గల్, మార్చి 9 (ప్రభాతవార్త):** ఒడిశాలోని బరంపుర యూనివర్సిటీలో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రిటీ క్యాంప్‌లో వర్గల్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినిలు వైష్ణవి ఆధ్వర్యంలో పాల్గొన్నారు. క్యాంపులో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పోతరాజుల నృత్యాలు, బతుకమ్మ ఉత్సవాలపై నృత్య ప్రదర్శన చేయగా ప్రథమ బహుమతిని గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.భాస్కర్‌రావు మాట్లాడుతూ నేషనల్ ఇంటిగ్రిటీ క్యాంప్‌లో ప్రథమ బహుమతి సాధించడానికి కృషిచేసిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ వైష్ణవిని అభినందించారు. అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎస్.రాధారాణి, జి.భాగ్యలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావులు వైష్ణవిని అభినందిస్తూ భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఘనత మా కళాశాల విద్యార్థుల ప్రతిభకు ప్రతిబింబమని మరియు ఇది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని కళాశాల సిబ్బంది పేర్కొన్నారు.

## పిటిఎస్‌ల రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ములుగు, మార్చి 9 (ప్రభాతవార్త):** గ్రంథాలయాల పార్ట్ టైం స్వీపర్స్ (పిటిఎస్) రాష్ట్ర కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ములుగు మండలం బండమైలారంలో రాష్ట్ర గ్రంథాలయాల పార్ట్ టైం స్వీపర్స్ గౌరవ అధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయా జిల్లాలకు చెందిన వారు పాల్గొన్నారు. అధ్యక్షునిగా పిట్టా హుస్సేన్ (నేరేడుచర్ల బ్రాంచ్), ప్రధాన కార్యదర్శిగా కస్తాల మధు (హుజూర్ నగర్ బ్రాంచ్), ఉపాధ్యక్షులుగా సిహెచ్ ఎల్లం (ములుగు), హద్నూరు అంకుష్‌కుమార్ (సంగారెడ్డి జిల్లా), కోశాధికారిగా ఖమ్మంపాటి మధుసూదన్ (పెన్‌పహాడ్ బ్రాంచ్), సహాయ కార్యదర్శిగా సయ్యద్ సలీం (ఆసిఫాబాద్ జిల్లా), చెరుకుపల్లి స్వామి (మంచిర్యాల జిల్లా)తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్ట్ టైం స్వీపర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తామని తెలిపారు.

## 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్

**న్యాల్‌కల్, మార్చి 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చిందని మండల అభివృద్ధి అధికారి కవలాస్ రాజశేఖర్ పేర్కొన్నారు. మార్చి 31వ తారీఖు వరకు 25 శాతం రాయితీతో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఎల్ఆర్ఎస్ ధరఖాస్తు దారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రజలకు ఎంపిడిఓ రాజశేఖర్ సూచించారు.

## ఎండిన చెరువుల-అల్లాడుతున్న మూగజీవాలు



ఎండిపోయిన చెరువులో తాగునీటి కోసం ఆరాటపడుతున్న మేకలు, గొర్రెలు

**కంగ్టి, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మూర్కుంజాల్ చాప్ట(కె), చాప్ట(బి) గ్రామాల శివారులోని చెరువులు ఎండుకుపోతుండటంతో మూగ జీవాలు తమ గొంతులను తడార్చుకునేందుకు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. చెరువులో నీరు లేక రైతులు ఓ వైపు అవస్థలు పడుతుంటే మరోవైపు మూగజీవాలు, పశువుల కాపరులు ఆందోళన,ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో మూగజీవాలు (మేకలు, గొర్రెలు, ఆవులు, గేదెలు, ఎద్దులు) అధికంగా ఉండటంతో వాటి దాహాన్ని తీర్చేందుకు గ్రామాల శివారులోని చెరువుల్లో నీరు లేక బహుదూరంగా ఉన్న చెరవుల వైపు మూగజీవాలను తీసుకుపోయేందుకు పశువుల కాపరులు పడరాని పాట్లు పడుతున్నారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. చెరవుల్లోని నుంచి అక్రమంగా కొందరు తమ వ్యవసాయ పంట పొలాలకు మోటార్లు ఏర్పాటు చేసుకుని అవసరం ఉన్నా లేకున్నా నీటిని సరఫరా చేసుకుంటుండటంతో చెరువుల్లో నీరు ఖాళీ అవుతున్నాయని పశువుల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల నుంచి అక్రమంగా నీటిని సరఫరా చేసుకోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## నేత్రపర్వంగా ఆరంభమైన శ్రీలక్షీ అనంత పద్మనాభ కళ్యాణోత్సం

### -ఆలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యేల పూజలు

**రామచంద్రాపురం, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెలలో శనివారం రాత్రి నిర్వహించిన శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, కళ్యాణోత్సవం నేత్ర పర్వంగా ప్రారంభం అయ్యాయి. వేద బ్రాహ్మణులు మంత్రాలు వల్లిస్తుండగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు తిలకించేందుకు వెలిమెల గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, ఒగ్గు సుచరిత కొమురయ్యలు వేరు వేరుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం గణపతి హోమం, శ్రీలక్ష్మీ అనంతపద్మనాభ స్వామి హోమం, లక్ష్మిహోమం, అమ్మవారికి, స్వామివారికి కుంకుమార్చన, పుష్ప యాగం కార్యక్రమాలు కనులపండువగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన వితరణ చేశారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**సైఫాబాద్, మార్చి 9 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం ప్రత్యేక రాష్ట్రం కోసం 2011 మార్చి 10వ తేదీన నిర్వహించిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితో ఆదివారం ట్యాంక్ బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద అనేక మంది ఉద్యమకారులు 'ప్రతిజ్ఞ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ కారుల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన ఉద్యమ కారులు ఈ ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సంర్భంగా ఫోరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ చీమా శ్రీనివాస్, పటేల్లో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలపై ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా ఉద్యమ కారులకు ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల స్థలం, పెన్షన్ ఇవ్వాలని, ఉద్యమ కారుల గుర్తింపు కోసం ఒక కమిటిని వేసి గుర్తింపు కార్డులను ఇవ్వాలని, ఉద్యమ కారుల సంక్షేమ కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు వీరాస్వామి, కొండ స్వామి, ఐలయ్యయాదవ్, జ్యోతిరెడ్డి, గగన్‌కుమార్, జానికిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జెన్‌టిక్స్‌పై పరిశోధన చేసిన శ్రీకృష్ణ సమాజానికి ఆదర్శం



శ్రీకృష్ణను సత్కరిస్తున్న వెంకటయ్య, కృష్ణస్వరూప్

**సైఫాబాద్, మార్చి 9 ప్రభాతవార్త:** సమాజంలోని సమస్యలపై పోరాటం చేస్తూ జనటిక్స్ విభాగంలో గుండెపోటు లాంటి గొప్ప అంశాలపై పబ్బుతి శ్రీకృష్ణ పిహెచ్‌డి చేయడం అద్భుతమని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కని వెంకటయ్య చెప్పారు. శ్రీకృష్ణ సమాజానికి ఆదర్శమని, ఒక వైపు రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ వాదాన్ని బతికిస్తూ మరొక వైపు సైన్స్‌లో ఇలాంటి పరిశోధనలు చేయడం సమాజానికి ముఖ్యమన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జెనిటిక్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా సాధించిన శ్రీకృష్ణను ఆదివారం శాంతి చక్ర అపార్ట్‌మెంట్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సామాజిక కార్యకర్త వెంటకయ్య, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, ప్రొఫెసర్ వెంకటదాసు, ప్రొఫెసర్ వెంకటరాజ్యం, సీనియర్ జర్నలిస్టు ఇంద్రవెల్లి రమేష్, ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ తెలంగాణ అధ్యక్షుడ దాసరి లక్ష్మయ్య, తారా అధ్యక్షుడు డా.దాసరిరంగా, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వినయ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ పాలమూరు ప్రాంతం నుంచి పేద ఎస్సీ కుటుంబంలో జన్మించిన శ్రీకృష్ణ డాక్టరేట్ సాధించడం గొప్ప విషయమని అభినందించారు. ఆయన పరిశోధన ఫలాలు సమాజానికి అందాలంటే ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. అనంతరం వారు శ్రీకృష్ణను ఘనంగా సత్కరించారు.

### ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారికి శస్త్రచికిత్స

**నాంపల్లి, మార్చి 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించిన తర్వాత సుమారు దశాబ్ద సంవత్సరాలపాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా విశేష సేవలందించిన విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారికి శస్త్రచికిత్స జరిగింది. ప్రధాన సలహాదారుగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా రంగస్థలం, కళారంగంలో వివిధ కళలు, కళాకారులు, కళా సాంస్కృతిక సంస్థల అభ్యున్నతికి అన్నివిధాలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తూ పెద్దదిక్కుగా తోడ్పాటుతో చేదోడువాదోడుగా నిలువడమేకాక ఉభయ తెలుగురాష్ట్రాల కళా సాంస్కృతిక, రంగస్థల రంగాల్లో తనవంతు ప్రముఖ సేవలు అందించడం విశేషం. గత కొన్ని సంవత్సరాలుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న డా. కె.వి.రమణాచారి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుల సలహామేరకు 15నెలల క్రితం ఎడమ మోకాలికి శస్త్రచికిత్స చేయించుకోగా, నాలుగురోజుల క్రితం నగరంలోని ప్రముఖ ఆస్పత్రిలో ప్రఖ్యాత ఆర్థోపెడిక్ వైద్యులచే కుడి మోకాలుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. శస్త్రచికిత్స విజయవంతం అయినట్లు, వైద్యుల పర్యవేక్షణాంతరం ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేయనున్నట్లు వెల్లడించారు. నెలరోజులపాటు పూర్తి విశ్రాంతి తర్వాత ఫిజియోతెరఫీతో ఆయన పూర్తిగా కోలుకుంటారని వైద్యులు తెలిపారు.

### దశాబ్దాల మహిళల పోరాట ఫలితమే మహిళా దినోత్సవం

**రవీంద్రభారతి, మార్చి 9 ప్రభాతవార్త :**

అనేక దశాబ్దాలుగా అనునిత్యం అనేకరకాల వివక్షలకు గురవుతూ ఎంతో మానసిక వేదనను అనుభవించిన మహిళామణుల పోరాట ఫలితమే ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవమని ముఖ్యఅతిథి ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. మహిళల జీవిత చైతన్యానికి గుర్తుగా పోరాటం జరుపుతున్నారని, ఆర్థిక కుటుంబ బాధ్యతలను ఒక గృహిణిగా, తల్లిగా, భార్యగా ఎదుర్కొంటూ ఆదర్శంగా నిలబడడం స్ఫూర్తిగా తీసుకోవాలని గౌరవ అతిథి ఆచార్య గౌరీశంకర్ అభిప్రాయపడ్డారు. నవ్యసాహితీ సమితి, నవ్యనాకట సమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు డా. ఫణీంద్ర అధ్యక్షత వహించగా వేమరాజు విజయకుమార్, ఆర్‌ఎస్.సుధారాణి, లక్ష్మీ మానస, ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి అతిథులతో కలిసి వివిధ రంగాల ప్రముఖ మహిళలు డా. ముక్తేవిభారతి, డా. కామిశెట్టి గోదాలక్ష్మి, నిష్టల సుధామాలలను ఘనంగా సత్కరించారు. సభకుముందు ప్రదర్శింపబడిన శారదా విజయం సాహిత్య రూపకం సభికులను విశేషంగా ఆకట్టుకుంది.

## మహిళల సాధికారతకు మహిళా దక్షత అంకితం



**హైదరాబాద్ మార్చి9,ప్రభాతవార్త :**

చందానగర్ లోని గంగారంలోని మహిళా దక్షత సమితి విద్యా సంస్థల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు సమాజానికి చేస్తున్న అమూల్యమైన సేవలకు గుర్తుగా నాయకులు, దాతలు, విద్యావేత్తలతో కూడిన విశిష్ట సమ్మేళనాన్ని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా దక్షత సమితి విద్యా సంస్థల అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ...నాలుగు దశాబ్దాలుగా విద్య ద్వారా మహిళల సాధికారతకు అంకితమైన మహిళా దక్షత సమితి దీర్ఘకాలిక కృషిని వివరించారు. డాక్టర్ బజాజ్ మాట్లాడారు. ప్రపంచాన్ని రూపొందించడంలో మహిళలు పోషించే కీలక పాత్రను నొక్కిచెబుతూ ప్రముఖ రచయిత్రి హ్యారియెట్ బీచర్ స్టోవ్ మహిళలే సమాజానికి నిజమైన రూపకర్తలు అని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు కల్పించడానికి సహకరించిన దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉషా గోపాలరత్నం,తెలంగాణ ప్రథమ మహిళ సుధాదేవ్ జి శర్మ,డా.సరోజ్ బజాజ్,వర్మ,తదితరులు పాల్గొన్నారు.

## దయాబెటిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలి

**హైదరాబాద్, మార్చి 9 ప్రభాతవార్త**

దయాబెటిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రముఖ దయాబెటాలజిస్ట్ డాక్టర్ దిలిప్‌కుమార్ కాందార్ అన్నారు. క్షుదిరాం మెమోరియల్ దయబెటిక్ క్యాంపస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత దయబెటిక్ ఆరోగ్య వైద్య శిబిరం జరిగింది. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలోని మాణికేశ్వర్‌నగర్‌లో 7 టెంపుల్స్ కమ్యూనిటీ హాల్‌లో ఈ ఉచిత వైద్య శిబిరం జరిగింది.తార్నాకలోని కాందార్ దయాబెటిస్ సెంటర్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధితో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దయాబెటిస్ సోకిన వారికి అనేక రంగాల ఆరోగ్య సమస్యలు వస్తూ ఉంటాయని, శరీరంలోని పలు అవయవాలపై ప్రభావం చూపిసూనత ఉంటుందన్నారు. చివరికి గుండె, కిడ్నీతోపాటు కంటి, వినికిడి వంటి సమస్యలు ఏర్పడుతాయని తెలిపారు. శరీరంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకునేందుకు బాధితులు నితనయం ట్యాబ్లెట్లు వేసుకుంటారని, షుగర్


క్షుదిరాం మెమోరియల్ దయబెటిక్ క్యాంపస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో మందులు పంపిణి చేస్తున్న డాక్టర్ దిలిప్‌కుమార్ కాందార్

లెవల్స్ బాగా పెరిగిపోయినవారికి ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటూ ఉంటారని తెలిపారు. ప్రస్తుతం వ్యాధికి కొత్త చికిత్సలు, మందులు అందుబాటులోకి వచ్చిందన్నారు. శరీరక వ్యాయామం,ధ్యానం వంటివి అలవర్చుకోవాలని కోరారు.ఇటీవల క్షుదిరాం మెమోరియల్ దయబెటిక్ క్యాంపస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు దయాబెటిక్ వైద్య శిబిరాలను నిర్వహిస్తూ పేదవర్గాలకు ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ దిలీప్‌కుమార్ కాందార్ అన్నారు. ఈ కార్యక్రమంలో క్షుదిరాం మెమోరియల్ దయబెటిక్ క్యాంపస్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ మోనాలిస భదురీ, బిజెపి సీనియర్ నాయకులు రాము వర్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## అధికారులు మారినా ఆగని అక్రమ నిర్మాణాలు...

**-అక్రమ నిర్మాణాలకు అంతెక్కడ**
**-కొంపల్లి మునిసిపల్‌కి తూట్లు..**
**అటకెక్కిన నిబంధనలు**
**-అడ్డగోలుగా అనుమతులు...**
**విచ్చలవిడిగా పుట్టుకొస్తున్న**
**అక్రమ నిర్మాణాలు**

**కొంపల్లి, మార్చి 09, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలో నగరంలో వేగంగా విస్తరిస్తున్న అభివృద్ధిలో పోటీపడే కొంపల్లి మున్సిపల్‌లో అధికారులు అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంలోనే మునిగితేలుతున్న వైనాన్ని స్థానిక ప్రజలు విమర్శలు చేస్తున్నారు. అక్రమ నిబంధనలు పాటించకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న నిర్మాణాలకు ఊతమిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డదారిలో అనుమతులు ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఉండే అధికారులు హయాంలో అనేక అక్రమ నిర్మాణాలు జరిగాయి. అయితే ఇప్పుడు కొత్తగా వచ్చిన అధికారులు కూడా అదే బాటలో అక్రమాలకు ప్రోత్సహిస్తున్నట్లు అక్రమ నిర్మాణాలే నిదర్శనం. గత కొంతకాలంగా పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. అధికారులు, సిబ్బంది వెలుగుబడితో ఆలోచనలకు ప్రతిరూపంగా ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన అక్రమాలకు మాయని మచ్చను తెస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి నిర్మాణాల వ్యవహారం పాలక మండలి నుంచి కమిషనర్ వరకు తెలిసి మౌనంగా ఉంటున్న ఘటనలు లెక్కకు మించి ఉన్నాయి. అభివృద్ధికి సహకరించాల్సిన అధికారులు అక్రమ నిర్మాణాలకు నిలయంగా మారుస్తూ కొంపల్లి అభివృద్ధికి అడ్డుకట్ట వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కొంపల్లి మున్సిపాలిటీలో కొత్తగా నియమితులైన కమీషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇక్కడ వెలుస్తున్న ఈ అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని కొంపల్లి మున్సిపల్ అభివృద్ధిని పెంచాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సున్నితత్వం మానవత్వం నిండిన 'మధు కవనం'

**-ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మహ్మద్ సలీమ్**

**చిక్కడపల్లి, మార్చి 9 ప్రభాతవార్త:** మధువనం కవితా సంపుటి లో సున్నితత్వం మానవత్వం పరిమళించే కవితలు వున్నాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం అన్నారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో ప్రముఖ రచయిత్రి మృదుల రచించిన 'మధుకవనం' గ్రంథావిష్కరణ సభ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు (రాజేంద్రనగర్) మహ్మద్ సలీమ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కాశీం గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కవిత్వం రాసే ప్రతి కవీ కవిత్వం గురించి అమ్మ నాన్న గురించి తప్పక రాస్తారు అని అలాగే మృదుల గొప్పగా భావవ్యక్తీకరణ చేశారు అని ప్రశంసించారు. ప్రేమ, ప్రకృతి వ్యాఖ్యానించటం కవిత్వం అని, మృదుల కవిత్వం అంతా అదేనని అన్నారు, స్త్రీ లకు పరిశీలన శక్తి ఎక్కువ అని, మృదుల లో అట్టి ప్రతిభ వుందని అభినందించారు, ఐతే నేడు అసమ్మతి ప్రకటిస్తేనే నేరంగా భావించే సందర్భంలో మృదుల వాస్తవ పరిస్థితి పరిశీలన చేసి రాబోయే రోజుల్లో సామాజిక దృక్పథంతో రాయాలని కోరారు. కీలకోపన్యాసం చేసిన మహబూబ్‌నగర్ ఎంవిఎస్ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కోడోజు కృష్ణమూర్తి, మాట్లాడుతూ సమాజ హితం, సాహిత్య లక్ష్యం ఇనా నియమిత నిబంధనలు వుండవని


'మధు కవనం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం

అన్నారు. కవి ఆలోచనలు అక్షర రూపం దాల్చి నప్పుడు అత్యుత్తమ సంస్కారం వ్యక్తీకరణ కావాలని అన్నారు. మృదుల కవిత్వం అదే దిశ గా సాగింది అని తెలిపారు. సంఘాన్ని ప్రశ్నించే తత్వం లోతైన అధ్యయనం, వాస్తవిక దృష్టితో మృదుల కవిత్వ రచన చేసారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ త్రిపురం భాస్కర్‌రెడ్డి, మహేశ్వరం తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాల తెలుగు(పీజీటి) డాక్టర్ వి.జయప్రకాశ్, ఘట్‌కేసర్ సాంఘికసంక్షేమ గురుకుల కళాశాల తెలుగు అధ్యాపకురాలు అసిరెడ్డి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచీకరణ నేపథ్యంలో కుల వృత్తులు దెబ్బతిన్నాయి


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సిరికొండ మధుసూదనాచారి

**సైఫాబాద్, మార్చి 9 ప్రభాతవార్త:** రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకుడు కన్నెగంటి వెంకటరమణ రాసిన వ్యాసాల సంపుటి 'కాకతీయుల గురించి మరికొంత' అనే పుస్తకాన్ని, విశ్వ బ్రాహ్మణ ధర్మపీఠం సంచాలకులు చొల్లేటి కృష్ణామాచార్యులు రచించిన 'విశ్వ శిల్పి రామప్ప రమణీయ శిల్పకళా' అనే చారిత్రక నవలను రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి తెలుగు విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియం ఆదివారం ఆవిష్కరించారు. ధర్మపీఠం స్వర్ణోత్సవాల సందర్భంగా జరిగిన ఈ పుస్తకాల ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో కుల వృత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రస్తుతం డబ్బు, రాజ్యాధికారం సమాజాన్ని శాసిస్తున్నాయని చెప్పారు. విశ్వబ్రాహ్మణ జాతిని అభ్యుదయ పథంలో నడిపించడానికి విశ్వ బ్రాహ్మణ ధర్మపీఠం ఒక మార్గ దర్శకంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్, విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం సభాపతి డా.త్రిమూర్తుల గౌరీశంకర్, పద్మశ్రీ కూరెళ్ళ విఠలాచార్య, వేలు ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

### అపూర్వ సేవాభాగ్యం


మున్సిపల్ మహిళా ఉద్యోగులకు నూతన వస్త్రాలను అందించిన దృశ్యం

**చిక్కడపల్లి, మార్చి 9 ప్రభాతవార్త:** నిరుపేదలకు, దివ్యాంగులకు, చిన్నారులకు, మహిళలకు ఆసరాగా అపూర్వ విమెన్ అండ్ వైల్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిలుస్తోందని ఆ సంస్థ అధినేత్రి లక్ష్మీపద్మజ అన్నారు. గత పదేళ్లుగా పెద్ద ఎత్తున సేవాకార్యక్ర మాలు నిర్వహిస్తోంది. ఆదివారం గాంధీనగర్ లోని సంస్థ కార్యాలయంలో మున్సిపల్ మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పద్మజ ఆహారం, నూతన వస్త్రాలను అందించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో తరుచూ అన్నదానాలు, వస్త్ర, విద్యా దానాలు నిర్వహిస్తూ ఆపన్నులకు తల్లో నాలుకలా నిలుస్తోంది. తాజాగా వీరు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి కె. పార్థసారథి, ప్రజా గాయత్రి, కె.శ్రీనివాస్ బియ్యం బస్తాలు, నిత్యవసర వస్తువులను అందజేశారు.

## వాటర్ వర్క్స్ అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మా

**సైఫాబాద్, మార్చి 9 ప్రభాతవార్త:** హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న కిందస్థాయి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటియుసి కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివరేజ్ బోర్డు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివరేజ్ కార్మికులకు జనరల్ పర్పస్ ఎంప్లాయీస్‌కు ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు. 1990 నుంచి కార్మికులకు ప్రమోషన్‌లు కల్పించకపోవడం దారుణమని, వారు పదన్నోతి లేకుండానే పదవి విరమణ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని అర్హతలు ఉన్నవారికి గ్రేడ్ 2లో పదోన్నతలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా హెచ్‌ఆర్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, బదిలీలు సక్రమంగా చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు కె.రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె నర్సింహ్మా, జిబి సర్వేశ్, దేవదాస్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు ముత్త సంపత్, కనకాల శ్యామ్ తెలంగాణ హక్కుల వేదిక అధ్యక్షుడు కౌశిక శ్రీనివాస్, మల్ శెట్టి కురుమ, ప్రధాన కార్యదర్శి చిలువల్లి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాడి రమేష్ , దయ్యాల శ్రీనివాస్, గణం నరసింహ తదితరులు పాల్గొన్న దృశ్యం

## మహిళలు చట్ట సభలలో సమన్యాయం సాధించే వరకు పోరాడాలి

**నిజాంపేట్, మార్చి 9, ప్రభాతవార్త**

మహిళల హక్కులు, చట్ట సభలలో సమన్యాయం సాధించే వరకు పోరాడాలని భారత జాతీయ మహిళా సమాఖ్య మేడ్చల్ జిల్లా నాయకురాలు పాలభిందెల సింధూరి అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మార్చి 3వ తేదీ నుండి 10వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుతున్న సందర్భంగా ఆదివారం నిజాంపేట్ పరిధిలోని ఇంద్రన్న కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ మేడ్చల్ జిల్లా నాయకురాలు పాలభిందెల సింధూరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడి 70 సంవత్సరాల అయిందని, నాటి నుండి దేశ వ్యాప్తంగా మహిళల కోసం అనేక పోరాటాలు చేసి సాధించుకున్నామని అన్నారు. అటి హక్కులను కాపాడుకునే బాధ్యత మహిళలుగా మన పైన వుందని అన్నారు. పూర్వం కాలంలో మహిళా చదువుకునే హక్కు లేదు అని, ఖర్కానాలో పని చేసే మహిళలు తమ పసి పిల్లలకు పాలు ఇచ్చే హక్కు కూడా లేదని, ఆ టైంను కూడా లెక్క వేసి జీతం లోనుండి కట్ చేసే దౌర్భాగ్యపు పరిస్థితులు చూశారు అని అన్నారు. మనువాదులు, బ్రాహ్మణవాదులు మహిళలను వంట గదికే పరిమితం చేశారు అన్నారు. అ స్థాయి నుండి ఇప్పుడు ఆకాశమే హద్దుగా ఎక్కడ చూసిన మహిళలు,


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ప్రతి పనిలో మహిళలు పురుషునితో సమాన హక్కు సాధించమని అన్నారు. ఈ ప్రయాణంలో అనేక మంది మహిళమూర్తులు, సావిత్రి బాయి లాంటి వారు అనేక పోరాటాలు చేశారు అని అన్నారు. ఇప్పుడు ఇంకా మహిళపై లైంగిక దాడులు, అత్యాచారాలు పెరుగుతూనే వున్నాయిలని అన్నారు. మహిళాపై జరుగుతున్న అకృత్యాల ఆగిపోయే వరకు పోరాటాలు నిరహించాలని, చట్ట సభలో 33 రిజర్వేషన్ కల్పించేవరకు పోరాటం చేయాలనీ వారు డిమైండు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు రాధిక, రమ, తులసి, ఆదిలక్ష్మీ, అలివేలు, గంగామణి, ఉషారాణి, సుజాత, పావని, పద్మ, సునీత, సంధ్య కుమారి, మేఘన, కుమారి, శ్యామల, అరుణ, శిరీష, లక్ష్మీ, సుధా, అనిత, వనిత, పాల్గొన్నారు.

### రక్తదానం చేస్తే ఒక జీవతం నిలబడుతుంది: లక్ష్మి


రక్తదాన శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న బ్రహ్మకుమారీస్

**సైఫాబాద్, మార్చి 9 ప్రభాతవార్త:** సమాజ సేవలో తాము సైతం అంటూ ఎప్పుడు ముందుండే బ్రహ్మకుమారీస్ సంస్థ ఆదివారం మణికొండలోని ల్యాంకో హిల్స్‌లోగల మంజీర హాల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించింది. అన్నదానం చేస్తే ఒక్కపూట ఆకలి తీరుతుందని, రక్తదానం చేసే ఒక జీవితమే నిలబడుతుందని మణికొండ శాఖ సంచాలకురాలు లక్ష్మి చెప్పారు. అనేక మంది యువకులు, పెద్దవారు ఎంతో ఉత్సహంగా, స్వచ్ఛందంగా ఈ రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ధీరజ్‌అగర్వాల్, డాక్టర్ రోషణి, రెడ్ క్రాస్ ఛైర్మన్ విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మకుమారీస్ సమాజానికి చేస్తున్న సేవల గురించి, ఆత్మవిశ్వాసం పెంచుకోవడానికి అవసరమైన ఉపాయాలను శంషాబాద్ శాఖ బ్రహ్మకుమారీస్ శాఖ ఇన్‌చార్జి శక్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతి సరోవర్ అకాడమీ ప్రతినిధులు కోమల్, తులసీ, రామ్‌గోపాల్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### వాసివి ఇంజనీరింగ్ కళాశాల ఉచిత ఆరోగ్య శిబిరం

**సైఫాబాద్, మార్చి 9 ప్రభాతవార్త:** వాసవి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ హైదరాబాద్, ఒలివ్ హాస్పటల్ మెహదీపట్నం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఇబ్రాహింబాగ్ గ్రామ నివాసితుల కోసం ప్రత్యేకంగా 'ఉచిత ఆరోగ్య శిబిరం' నిర్వహించడం జరిగింది. ఈ శిబిరాన్ని కళాశాల నయుక్త కార్యదర్శి ఎం.ఆనంద్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.వి.రమణ కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో ఇసిజి, 2డి ఎకో, బోన్ మినరల్ డెన్సిటి (బిఎండి), షుగర్, రక్తపోటు తదితర పరీక్షలు ఆ గ్రామ ప్రజలకు ఉచితంగా నిర్వహించి, వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.పి. వెంకటేశ్వరరావు, ఎం.వి.రవికుమార్, ఎస్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకుల బృందం విజయవంతంగా ఈ శిబిరాన్ని నిర్వహించడం జరిగింది.

### 43 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు


తాను రచించిన పుస్తకాన్ని మిత్రులకు అందజేసి సత్కరించిన డా.లక్కరాజు నిర్మళ

**తార్నాక, మార్చి 9 ప్రభాతవార్త :** ఉన్నత చదువులు చదివి వేర్వేరు ప్రదేశాల్లో స్థిరపడిన స్నేహితులు 43 ఏళ్ల తర్వాత కలుసుకున్న అరుదైన ఘటన తార్నాకలో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్‌లో 1982లో బీఈడీ చదివిన మిత్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం తార్నాకలో డా.లక్కరాజు నిర్మల నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు తమ పాత స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పట్లో తాము గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకొని ఆనందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి డాక్టర్ లక్కరాజు నిర్మల, సురభి భూపతిరావు, బెజ్జారపు వేణుగోపాల్, పద్మావతి, రాజేంద్రప్రసాద్, షేక్ మీరా, కిష్టా చారి, శ్రీనివాసులు, కుమారస్వామి, రాంప్రసాద్, పుల్లయ్య, సింహయ్య, గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

**హైదరాబాద్, మార్చి 9 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టె బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని సెంట్రల్ యూనివర్సిటి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సమాజం ముందుకు వెళ్ళాలంటే విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌నగర్‌లో 'బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని' చేపట్టిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ధనిక రాష్ట్రంగా చెప్పుకునే తెలంగాణ విద్యారంగంలో చివరి స్థానంలో ఉందని, ప్రజా పాలకులమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల మాదిరిగా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయరాదని, మౌలిక సదుపాయాలను పెంపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, ప్రైవేటు విద్యా సంస్థలు, కార్పోరేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, ఎస్‌టియు కార్యనిర్వాహక అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, పిడిఎస్‌యు కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ప్రతిభా నైపుణ్యాలతో అన్ని రంగాలలో రాణింపు : తోకల శ్రీనివాస్ రెడ్డి


అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి,

**మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 9 ప్రభాతవార్త :** మహిళలు తమ ప్రతిభ నైపుణ్యాలతో అన్ని రంగాలలోను రాణిస్తున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల వేడుకల్లో భాగంగా ఆదివారం ఆరాంఘర్ చౌరస్తాన్యాప్రిన్స్ ప్యాలెస్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి చాలా గొప్పదని,మహిళలు అన్ని రంగాలలోను చురకుగా పాల్గొనటం శుభ పరిమాణమని,మహిళలు తాము అభివృద్ధి చెందటమే కాకుండ ఇతరులకు కూడ ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు.మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ మాట్లాడుతూ గత పది సంవత్సరాలు నుంచి కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి మా తోడు ఉంటూ మా కోసమే మహిళా దినోత్సవాలను నిర్వహిస్తున్నందుకు అక్కా చెల్లెళ్ల అశీస్సులు నిండుగా ఉండాలని కోరుకుంటున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మీతో పాటు స్థానిక అంగన్‌వాడి, మహిళా గ్రూప్ ముఖ్య సభ్యులు, పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, మార్చి 9, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొలన్ హన్మంత్ రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సాయి కృష్ణజ కాలనీలో సీసీ రోడ్ లేకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి, ఎన్.ఎం.సీ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి రూ. 25,00,000 లక్షల మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ప్రజలందరికీ ప్రతిరోజు అందుబాటులో ఉంటానని తెలిపారు. కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె జనార్దన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, వెంకటేశ్వర్ రావు, జీవన్ రెడ్డి, జైసింహ రెడ్డి, నాగేశ్వర్ రావు, విజయ్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

### పేకాట శిబిరంపై బాచుపల్లి పోలీసుల దాడులు.. ఐదుగురు అరెస్ట్ రూ. 5,090 స్వాధీనం..


పోలీసులు అదుపులో ఐదుగురు వ్యక్తులు

**కొంపల్లి, మార్చి 9, ప్రభాతవార్త**

ఐదుగురు వ్యక్తులు పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని విశ్వాసనీయ సమాచారం అందడంతో బాచుపల్లి పోలీసులు పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 5.090 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో బాచుపల్లి పోలీసులకు నిజాంపేట ఇందిరమ్మ కాలనీ ఫేస్-2, ఇంటి నెంబర్ 23లో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ ఇంటిపై దాడులు చేసి అక్కడ మూడుముక్కల ఆట ఆడుతున్న నిజాంపేట జయభారత్ నగర్‌కు చెందిన మిస్సకోడేటి ముని, నిజాంపేట ఇందిరమ్మ కాలనీ చెందిన కోటేశ్వరరావు, నిజాంపేట ఈశ్వర విలాక్ చెందిన నరసింహమూర్తి, నిజాంపేట్‌కి చెందిన వి. శ్రీనివాస్, నిజాంపేట బాలాజీ పార్క్‌తో చెందిన పి చంద్రయ్యలు కార్డ్స్ ఆడుతున్నట్లు నిర్ధారించుకున్నారు. దీంతో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో తాము పేకాట ఆడుతున్నట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుండి 5 సెల్ ఫోన్లు, రూ. 5,090 నగదు, రెండు పేకాట కార్డ్ సెట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై బాచుపల్లి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొనికేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గో పూజ నిర్వహిస్తున్న దృశ్యం

### పాత శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో
## కొనసాగుతున్న 55 వార్షిక బ్రహ్మోత్సవాలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లా కేంద్రంలోని పాత శ్రీవేంకటేశ్వర దేవాలయం పారుపల్లి వీధిలో స్వామి వారి సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ 55 వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. ఆదివారం రెండోరోజు గోపూజ, మూలమంత్ర హవనం,శ్రీభూ నీలా సమేత వేంకటేశ్వరస్వామివార్లకు 108 కలశాల్లో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలకు పండ్ల రసాల నింపి వాటికి పూజలు చేసి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన వితరణ చేశారు. సాయంత్రం ఎదురుకోల్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సేవా సమితి ప్రతినిధులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సిద్దిపేట
### ఎమ్మెల్సీ మధుసూదనాచారి



వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

**చిన్నకోడూరు, మార్చి 9, ప్రభాతవార్త :** కాకతీయుల కాలం నుంచి శివాలయాలను నిర్మించారని..విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనడం నా అదృష్టంగా బావిస్తున్నట్లు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. చిన్నకోడూరులోని శ్రీవీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఆదివారం పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట ప్రజలు చాల అదృష్టవంతులు..కెసిఆర్, హరీష్‌రావు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సిద్దిపేట అన్నారు. కెసిఆర్ హయాంలో చెరువులు, కుంటలు నీటితో నిండి గ్రామాలకు సాగునీరు అందిందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కామిని శ్రీనివాస్, వేలేటి రాధాకృష్ణశర్మ, ఉమేష్‌చంద్ర, ఇట్టబోయిన శ్రీనివాస్, కీసర పాపయ్య, జంగిటి శ్రీనివాస్, విశ్వబ్రహ్మణుల మండల అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశ్వబ్రహ్మణుల మండల సంఘం ఆధ్వర్యంలో మధుసూదనాచారిని ఘనంగా సత్కారించి మెమోంటోను అందించారు.

## సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలి



తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

**సిద్దిపేట అర్భన్, మార్చి 9, ప్రభాతవార్త :** తల్లిదండ్రులను గౌరవించడం.. మనందరి సంస్కృతి అని బిస్మార్ట్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రాంతి పాఠశాలలో ఆదివారం ప్రత్యక్ష దైవాలకు పాదాభివందనం పేరిట విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదాభివందనన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో సమాజం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ చాల ముఖ్యమన్నారు. చదువుతోపాటు తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. పాఠశాల చైర్మన్ అర్పిత భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ కుమారస్వామి, జర్నలిస్టు సంఘం నాయకులు అరుణకుమార్, సెక్టోరియల్ అధికారి బేతి భాస్కర్, పరిశీలకులు మహేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి మహాసభకు తరలివెళ్లిన నాయకులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న పద్మశాలీ సంఘం నేతలు

**ములుగు, మార్చి 9 (ప్రభాతవార్త):** హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన అఖిలభారత పద్మశాలి సంఘం 17వ జాతీయ మహాసభకు ములుగు మండలం వంటిమామిడి నుంచి పద్మశాలీలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా సింగన్నగూడ పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఎలిగేటి నాగరాజు,కార్యదర్శి నక్క హరికృష్ణ మాట్లాడుతూ పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం, హక్కులను సాధించుకునే దిశగా ఈ సభ నిర్వహించడం జరుగుతున్నదన్నారు. చేనేతల ఆత్మహత్యలకు కారణాలవుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకునేందుకు పటిష్ట కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పద్మశాలీలకు వడ్డీలేని రుణాలను అందజేసి ఆదుకోవాలని కోరారు. తరలివెళ్ళిన వారిలో పద్మశాలీ నాయకులు భోగ సాయి, నారా శేఖర్‌తో పాటు పద్మశాలీ సంఘం నేతలు ఉన్నారు.

## సాగు నీటి కోసం ఎంపిని కలిసిన బిజెపి నాయకులు

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :**
రైతుల పంటలు ఎండిపోకుండా కొండపాక మండలానికి సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంపి రఘునందన్‌రావును బిజెపి నాయకులు కలిసి కోరారు. ఆదివారం కొండపాక మండల బిజెపి అధ్యక్షుడు నీల సత్యం అధ్వర్యంలో బిజెపి నాయకులు ఎంపి రఘునందన్ రావును హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి కొండపాక మండలానికి తపస్‌పల్లి రిజర్వాయర్ నుండి సాగు నీటిని విడుదల చేయించి రైతులను అదుకోవాలని కోరారు. సాగు నీరులేక పంటలు ఎండిపోతున్నాయన్నారు. అధికారులతో మాట్లాడి డి4 కాలువ ద్వారా సాగు నీటిని అందించేలా చర్యలు తీసుకొవాలని అయనకు విజ్ఞప్తి చేశారు

# ఉపాధ్యాయులకు మూల్యాంకనం పారితోషకం వెంటనే చెల్లించాలి

### డిటిఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** గత సంవత్సరం పదవ తరగతి పరీక్ష పత్రాలను దిద్దిన (మూల్యాంకనం) ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే పారితోషకం చెల్లించాలని డిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకీ చంద్రభాను, జిల్లా కార్యదర్శి దేవర మల్లయ్య, ఆడిట్ కన్వీనర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-2024లో పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం డబ్బులు ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. ప్రతి సంవత్సరం మూల్యాంకనం అయిన తర్వాత ఉపాధ్యాయులకు నగదు రూపంలోగాని, వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారన్నారు . కాని ఈ ప్రభుత్వం గత సంవత్సరం పారితోషకమే ఇప్పటివరకు చెల్లించకపోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైన విద్యా శాఖ అధికారులు స్పందించి అట్టి పారితోషకాన్ని వెంటనే చెల్లించాలని కోరారు, 2008 సంవత్సరం ఉపాధ్యాయులుగా నియమించబడ్డ వారికి రెగ్యులర్ స్కేల్స్ ఇచ్చి, పిఆర్‌సిని, 4 డిఏ లను అమలు చేయాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణహించిన ఫీజులు మాత్రమే ఇసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజుల నియంత్రనపై నిరంతర నిఘాను ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ



దుద్దెడలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

## దుద్దెడ గురుకుల పాఠశాలలో మహిళా దినోత్సవం

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** మండల పరిధిలోని దుద్దెడ గురుకుల పాఠశాలలో మహిళాల దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా మహిళల రుణం తీర్చుకొలేనిది, సహనానికి వారు ప్రతికలని స్త్రీలు లేకుండా సమాజమే లేదని గురుకుల పాఠశాల దుద్దెడ పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చిట్యాల నర్సింలు అన్నారు.గురుకుల పాఠశాల, కళశాలలో పేరెంట్స్ కమిటీ అధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు పాఠశాల లో, కళాశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులను శాలువా లతో ఘనంగా సన్మానించారు. అనంతరం అయన మాట్లాడుతూ సంవత్సరంలో ఒక్కరోజే కాకుండా మహిళాలు ప్రతి రోజు పూజింపబడాలని అయన సూచించారు. మహిళాలు తల్లిగా, చెల్లిగా, బార్యగా మరేన్నో రూపాల్లో బాధ్యులను మోస్తు పురుషుల కష్టసుఖాల్లో సగ భాగంగా నిలుస్తున్న మహిళాలను ఎప్పటికి గౌరవిస్తునే ఉండాలన్నారు. స్త్రీశక్తి ముందు ఎశక్తి నిలిచి గెలువలేదని మహిళాల గొప్పతనాన్ని అయన ప్రశంసించారు. ప్రిన్సిపల్ సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, జూనియర్ ప్రిన్సిపల్ స్వప్నజ్యోతి, పేరేట్స్ కమిటీ సభ్యులు జాలిగామ నర్సింగరావు, మునిగడప రమేష్, కొడిమ్యాల శ్రీనివాస్, సిర్సనగండ్ల నర్సింలు, కొలిపాక భవాని తదితరులు పాల్గొని, మహిళా మూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా దుద్దెడ గ్రామంలోని దేశాయి బ్రదర్స్ లిమిటెడ్ బీడి కంపెనీలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గంపచోటి కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీడి కార్మిక సంగ్ ప్రధాన కార్యదర్శి సిలువేరు కిష్టయ్య ముఖ్య అతిథిగా హాజరైనారు.

## సమాజంలో మహిళా స్థానం గొప్పది



వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళాలను సన్మానించిన దృశ్యం

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** కుకునూరుపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల రాజు మాట్లాడుతూ సమాజంలో మహిళా స్థానం ఎంతో గొప్పదన్నారు. వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అయన మాట్లాడుతూ పురుషులతోపాటు మహిళాలు అన్ని రంగాల్లో సమనంగా పోటీ పడుతున్నారని తెలిపారు. మహిళ లేనిదే ఈ సమాజంలేదన్నారు. పంచాయతీ కార్యదర్శి స్వప్న, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంతోపాటు అంగన్‌వాడి టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో అర్యవైశ్య సంఘం నాయకులు నవీన్, ఉప్పల పాండురంగం, పొల్కంపల్లి నరేందర్, గంగిశెట్టి శ్రీనివాస్, స్రవంతి, రమ్య, స్వరూప, పులరాజు శివరాజ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రతాప్‌రెడ్డి

**మర్కుక్, మార్చి 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తిలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాచారం ఆలయ మాజీ చైర్మన్ హరిపంతులు, మాజీ ఎంపిపి పాండుగౌడ్, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్య, పలు పార్టీల నేతలు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీ సీతారామ చంద్రస్వామిని దర్శించుకుంటున్న ప్రతాప్‌రెడ్డి

## చెలిమి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల సహాయం

**గజ్వేల్ టౌన్, మార్చి 9 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని చెలిమి ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం 76వ సహాయ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని భారత్‌నగర్‌లో నివాసం ఉంటున్న జక్కా నితిన్(22) కారు డ్రైవర్ కాగా పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో మరో బైక్ ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆర్‌విఎం ఆసుపత్రి లో చికిత్స పొందుతుండగా వారిది పేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ ప్రతినిధులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15వేలు అందజేయగా, దోస్తోంకా గ్యారేజ్ మిత్రులు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చేపూరి సంతోష్, కోశాధికారి దొంతుల ఆనంద్, సభ్యులు గుంటుకు శ్రీనివాస్, పెద్దూరి శ్రీనివాస్, యాట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీల నూతన కార్యవర్గం ఎన్నిక

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** దుద్దెడ గ్రామ ముస్లిం మైనార్టీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడుడిగా ఎండి అక్బర్‌పాషా, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ నబీ, ప్రధాన కార్యదర్శిగా నూరోద్దిన్ , క్యాషియర్‌గా నవీద్, సలహాదారులుగా సల్మాన్, గూడ్ సాబ్ లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుండి అందే సంక్షేమ పలాలను ప్రతి పేద కుటుంబనికి అందేలా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రఫీయొద్దిన్, మెహినోద్దిన్, జబ్బార్, షాదుల్, అక్రమ్, సల్మాన్, అజ్గర్, అస్లాం, సమీర్, సాహెబ్ పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సింగం సత్తయ్యకు సన్మానం



సింగం సత్తయ్యను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**మర్కుక్, మార్చి 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి సింగం సత్తయ్య ఇటీవల బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం పాములపర్తి గ్రామంలో సింగం సత్తయ్యను బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ మర్కుక్ మండలం నుండి రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యునిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. బిజెపి పార్టీ అభివృద్ధి కోసం కలిసిమెలసి అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి మాజీ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు మహేష్‌గౌడ్, అశోక్, ఉప్పరి నరేష్, తండ స్వామి, పాతూర్ కుమార్ పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి : ఎమ్మెల్యే

**నర్సాపూర్, మార్చి 9, ప్రభాతవార్త :** విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ముఖ్యమైనవని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు శనివారం సాయంత్రం నర్సాపూర్‌లోని డాన్‌బాస్కో పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో టెక్నాలజీని ఎంతవరకు ఉపయోగించుకోవాలో అంతవరకే ఉపయోగించుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. టెక్నాలజీ ద్వారా తెలియని విషయాలను తెలుసుకొని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. టెక్నాలజీ ద్వారా నాలెడ్జి పెంచుకోవడానికి అతిగా టెక్నాలజీని వాడకూడదని సెల్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని విద్యార్థులకు గుర్తుచేశారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు సంప్రదించి విద్యార్థుల బిహేవియర్‌ను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ మున్సిఫల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ,మున్సిఫల్ మాజీ వైస్ చైర్మన్ నహీమొద్దీన్, కళాశాల డైరెక్టర్ నర్సి రెడ్డి, చైర్మన్ యశ్వంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ మేఘన, నాయకులు పంబల బిక్షపతి, రామ్ చందర్ , రింగుల ప్రసాద్, హరికృష్ణ విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



ఎమ్మెల్యే సునీతారెడ్డి



శివాలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా శివలింగ ప్రతిష్టాపన

**జగదేవ్‌పూర్, మార్చి 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో ఆదివారం గుండు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య శివలింగ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, హోమం నిర్వహించి తదనంతరం పూర్ణాహుతిని నిర్వహించగా మహాశివున్ని దర్శించుకోవడానికి గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు శ్రీకాంత్‌శర్మ, గ్రామ నాయకులు అన్నబోయిన లక్ష్మణ్, ఎన్.జనార్ధన్‌రెడ్డి, కె.కిష్టారెడ్డి, బోగర్ల ఈదులు, చిలుముల నర్సింలు, ఇండ్ల యాదగిరి, చెట్కూరి మల్లయ్య, కృష్ణ, కనకయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించి నర్సారెడ్డి



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్నున్న డిసిసి అధ్యక్షుడు నర్సా రెడ్డి

**కొండపాక, మార్చి 9, ప్రభాతవార్త :** సిసి రోడ్ల నిర్మాణంతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయిని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట డిసిసి అధ్యక్షుడు తూంకుంటా నర్సారెడ్డి అన్నారు. అదివారం కొండపాక మండల పరిధిలోని దుద్దెడ, రాంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తాజా మాజీ సర్పంచ్ వాసరి లింగరావు అధ్వర్యంలో సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఇచ్చిన మాటలకు కట్టుబడి హామిలను సిఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్టీసి బస్సుల్లో మహిళాలకు ఉచిత ప్రయాణం, ఉచిత కరంటు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతుల నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొయడ వేంకటేశం, పిఎసిఎస్ డైరెక్టర్ సురేందర్, పంబాల సురేందర్, అంబటి రాజు, సుదర్శన్, పర్షరాములు, పెద్వంకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత

**చిన్నకోడూరు, మార్చి 9, ప్రభాతవార్త :** మండల భవన నిర్మాణ కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని చౌడారం గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కదారి రాజలింగం మృతి చెందడంతో బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే మాచాపూర్ గ్రామానికి చెందిన కోయడ చంద్రయ్య మృతిచెందగా బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కోయడ చంద్రయ్య కుటుంబానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. కార్మికులు చనిపోతే రూ.5 లక్షల ఇవ్వలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోతే రూ.10 లక్షలు ఇవ్వలన్నారు. కార్యక్రమంలో మండల భవన నిర్మాణ యూనియన్ అధ్యక్షులు చెరుకు నారాయణ, ప్రతినిధులు ఉడుత ఐలయ్య, శంకరయ్య, రవి,రమేష్, భూమయ్య, రాజు,రాజమల్లు, పరశురాములు, నర్సయ్య, మల్లయ్య, రాజమల్లు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బికెఎస్ ఆధ్వర్యంలో జాతీయ జెండావిష్కరణ

**హవేళిఘనపూర్, మార్చి 9,ప్రభాతవార్త:** సమాజానికి అన్నం పెట్టే రైతన్నలకు సమస్యలు కలిగించవద్దని బికెఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్ర అన్నారు. మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సాంగ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పిలుపుమేరకు జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ నాయకత్వంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలపై భారత దేశంలోనే అతిపెద్ద సమస్త గా ఎదిగిందని వారు అన్నారు రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న పోరాటాలతో హక్కులతో సాధించిన ఘనత బి కే ఎస్ దే అని అన్నారు సమస్యలు పరిష్కరించడంలో భారతీయ కిసాన్ సన్ ముందుండి పనిచేస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు ఎక్కడ దేవి శ్రీపాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న బికెఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు రాంచందర్

# లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవడమే రాజ మార్గం

### న్యాయమూర్తి రుబినా ఫాతిమా



జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి రుబీనా ఫాతీమా తదితరులు

**నర్సాపూర్, మార్చి 9, ప్రభాతవార్త :**
జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు కేసుల్లో రాజీ కుదుర్చుకొని రాజీ పడటమే రాజ మార్గమని చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కం సీనియర్ సివిల్ జడ్జ్ మెదక్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, నర్సాపూర్ న్యాయమూర్తి రుబినా ఫాతిమా అన్నారు. నర్సాపూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సౌజన్యంతో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నర్సాపూర్ కోర్టులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి రుబీనా ఫాతిమా హాజరై రాజీ చేయదగ్గ కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా రుబీనా ఫాతిమా మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయదగ్గ కేసుల్లో ఇరువర్గాల రాజీ కుదుర్చుకొని కేసులను తొలగించుకోవచ్చునని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్షణికావేశంలో తగాదాలు పడి కేసులు నమోదయి కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ కాలాన్ని వృధా చేసుకుంటున్నారని అన్నారు. ఈ కోపతాపాలను పక్కనపెట్టి రాజీ పడి సమయాన్ని వృధా చేయకుండా శాంతియుతంగా కేసులను పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 137 కేసులు పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలోపబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సాపూర్ ఆర్. రాఘవేంద్ర,అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది పి.సుధాకర్,ఎస్ఐలు బి.లింగం నర్సాపూర్, మధుకర్‌రెడ్డి శివంపేట్, రంజిత్ కుమార్‌కౌడిపల్లి, ఏఎస్ఐ ఎం.డి.మిస్బొదిన్ చిలప్ చెడు, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.డి.కాజాఅజీజ్ హైమద్ నర్సాపూర్, ఎస్.లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ మధుశ్రీ, లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, బార్ ప్రెసిడెంట్ బార్ అసోసియేషన్ నర్సాపూర్ డి.శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు ఏ.అంజిరెడ్డి, ఇక్బాల్ అలీ జాఫర్, ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌గౌడ్, కె.ప్రకాష్, ఏ.శ్రీనివాస్, ఈ.సత్యనారాయణ, ఏ.ఆనంద్‌కుమార్, వి.ప్రభు, కె.రాజునాయక్, ఎం.డి.ఆరిఫ్, ఏ.సాయిరాం, జె.రవినాయక్, బ్యాంక్ అధికారులు, కోర్టు సూపరింటెండెంట్, మహమ్మద్ జలీల్ హైమద్, పద్మావతి, లీగల్ సర్వీస్ సిబ్బంది ఆంజనేయులు, కోర్టు సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుల్స్ కక్షిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదింటి పెళ్లి కూతురికి పుస్తెలు మెట్టెలు పంపిణీ

**నర్సాపూర్, మార్చి 9, ప్రభాతవార్త :**
పేదింటి పెళ్లికూతురుకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి పుస్తెలు మెట్టెలు ఆ పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామానికి చెందిన రోటం బాలేష్ మణెమ్మ దంపతుల ద్వితీయ కూతురు నాగరాణి వివాహానికి ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరా రెడ్డి ద్వార గ్రామినికి చెందిన బిజెపి నాయకులు పులుంటి మల్లేషం, పులుకంటి పాల నర్సయ్య ల చేతుల మీదుగా పెళ్లికూతురు నాగరాణి కుటంభ సభ్యులకు పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామమాజీ సర్పంచ్ నీరుడు బిక్షపతి,పులుకంటి పాల నరసయ్య, సంజీవులు, మల్లేశం, బాలేశ్‌చ సాయిలు తదితరులు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT & SESSIONS JUDGE, AT: SANGAREDDY
G.W.O.P.NO. 07 OF 2025
BETWEEN: -
Shaik Madiha Safura, In the Matter of Minors:
1. Shaik Zunnera Fatema
2. Afira Azharuddin Shaikh
3. Bushra Azharuddin Shaik
............... Petitioner
AND
To whomsoever It May Concern,
............ Respondent
TO: -
To whomsoever It May Concern,
.........Respondent
NOTICE
Take notice that the above-named Petitioner filed the O.P for Declaration as Guardian of Minors & Permission for the Alienation of Properties of Minor in the above suit vide G.W.O.P.No. 07 of 2025 before the Hon'ble Prl. District & Sessions Judge, Sangareddy in respect of the Suit Scheduled Properties I.e., Agriculture Lands in Sy.No.401/AA2/1/3 (Admeasuring Ac.0-04 Gts), Sy.No.401/AA2/1/1 (Admeasuring Ac.0-04 Gts), Sy.No.401/AA2/1/2 (Admeasuring Ac.0-0350 Gts), all situated at Ismailkhanpet Village, Sangareddy Mandal & District, Telangana. The said G.W.O.P is posted to 01-04-2025 at 10-30 A.M for your appearance in person or through an advocate, failing which the case will be decided Ex-Parte.
// BY ORDER OF COURT //
D.VIJAY BHASKAR RAO,
D.SAI VIKRANTH, Advocates-
Office At: 11-78/11, Ponna Colony, Pothireddypally, Sangareddy, Telangana, 502295,
Mob.No.: 7660899180



కట్ట మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా మైసమ్మ, ఎల్లమ్మ తల్లి జాతర

**ముఖ్య అతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ నేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

**జిన్నారం, మార్చి 9,ప్రభాతవార్త:** మండలంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో కట్టమైసమ్మ జాతరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. "మైసమ్మ తల్లి మా ప్రజలను చల్లగా చూడాలని ఆకాంక్షించారు. అనంతరం రాళ్లకత్వలో ఎల్లమ్మ తల్లి జాతరలో హాజరైన ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ప్రార్థించారు. తదనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన దృశ్యం

**వట్‌పల్లి, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సాయిపేట గ్రామంలో ఆదివారం బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వాహించారు. గ్రామంలోని పెద్దలు ముఖ్యనాయకులు పరిసర గ్రామలలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్యక్షులు ప్రతాప్ రమేష్ జోషి హాజరయ్యారు. సాయిపేట కురుమ సంఘం పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముఖ్యనాయకులు తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం



కళ్యాణం సందర్భంగా స్వామివారిని అలంకరించిన దృశ్యం

**జోగిపేట, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కిచ్చనపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి కళ్యాణోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 7న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి వారి కళ్యాణం ఘనంగా చేపట్టారు. కళ్యాణ ఘట్టానికి ముందుగా విశేషారాధన, పుణ్యవచనం, మాంగళ్య భుజ, యజ్ఞభవితధారణ, కన్యాదానం తదితర కార్యక్రమాలు చేశారు. కళ్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీఎత్తున భక్తులు హాజరయ్యారు. కాగా సోమవారంనాడు సాయంత్రం గరుడవాహనము, స్నానసేవ, శేషవాహన సేవ తదితర కార్యక్రమాలు, మంగళవారంనాడు రాత్రి శ్రీవారి రథోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా ముఖ్యమైన కళ్యాణోత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

## నేడు శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

**గుమ్మడిదల, మార్చి 9 ప్రభాతవార్త:** బొంతపల్లి వీరన్న గూడెంలో కొలువుదీరిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానం ఆలయ ధర్మ కర్తల నూతన చైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారం సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉంటుందని కార్యనిర్వాహణాధికారి శశిధర్ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని పార్టీల నాయకులు, మాజీ చైర్మన్‌లు, మాజీ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీపోచమ్మ తల్లికి ఘనంగా బోనాల ఊరేగింపు



అమ్మవారికి బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

**కొల్చారం, మార్చి 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సంగాయిపేట గ్రామంలో ఆదివారం శ్రీపోచమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుండి బోనాలను ఆడపడుచులు శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య తీసుకువచ్చి శ్రీపోచమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి బోనాలను శ్రీ పోచమ్మ తల్లికి సమర్పించారు. అమ్మవారికి భక్తులు ముక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ పోచమ్మ తల్లి గ్రామ ప్రజలందరినీ చల్లగా చూడాలని, పాడిపంటలుతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉంచేలాని శ్రీ పోచమ్మ తల్లిని వేడుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు, ఉన్నారు.

## బీరప్ప జాతర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**మనూర్, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దన్వర్ గ్రామంలో కొనసాగుతున్న బీరప్ప జాతరమహోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాతర మహోత్సవాలకు చేరుకున్న ఎమ్మెల్యేను జాతరనిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బోజిరెడ్డి మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, శంకరప్ప, పండరిపాటిల్, జ్ఞానేశ్వర్‌రావు, విటల్‌రెడ్డి, కిష్టరెడ్డి, మాణికయ్య, శామయ్య, తుక్కయ్య తదితరులు ఉన్నారు.



బీరప్ప జాతర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

# డంపింగ్ యార్డును రద్దు చేసేవరకు పోరాటం ఆగదు

**జెఎసి నాయకులు**



దీక్షలో పాల్గొని మాట్లాడుతున్న మండల జేఏసీ నాయకులు

**గుమ్మడిదల, మార్చి 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నల్లవల్లి ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌ను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని మండల జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్ రెడ్డి, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మూడు చింతల నరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా గుమ్మడిదల మండల ప్రజలు చేపట్టిన పోరాటం 33వ రోజుకు చేరుకుంది. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రిలేనిరాహారదీక్షలో ఆదివారం వారు పాల్గొని నిరాహార దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు తీవ్రంగా నష్టం కలిగించే డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. దీనివల్ల పర్యావరణ, ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల తమ పిల్లల భవిష్యత్తు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రస్తుతం డంపింగ్ యార్డ్ నిర్వాహకులు డంపింగ్ యార్డ్ వల్ల ఎలాంటి ప్రమాదాలు ఉండవని చెప్పినా దానికి భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఊహిస్తేనే భయంకరమైన విషయాలు గుర్తుకొస్తున్నాయని, అందుకుగాను ముందుగానే డంపింగ్ యార్డ్‌ను నిలిపివేయాలని కోరుతున్నామని తెలిపారు. డంపింగ్ యార్డును రద్దు చేసే వరకూ పోరాటం ఆగదని, మా పిల్లల భవిష్యత్తు కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉంటామని పెద్ద ఎత్తున మహిళలు, యువకులు, గ్రామస్థులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచి ఆంజనేయులు, ఉప సర్పంచి విజయ్‌కుమార్, నాయకులు సూరారం మహేష్, ఆకుల ఆంజనేయులు, కుమ్మరి వెంకటేష్, కరుణాకర్, సత్తయ్య, ఆగం భాస్కర్, ప్రశాంత్‌రెడ్డి, మన్నె మధు, శ్రీగది వెంకటేష్, ఆగం మల్లేష్, నీరుడి కృష్ణ, అమ్మగారి సులత, కుమ్మరి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ సోమేశ్వరి

### మహిళల సమానత్వం ఇంటి నుంచే

## ప్రారంభం కావాలి : ఎస్ఐ సోమేశ్వరి

**అమీన్‌పూర్, మార్చి 9 ప్రభాతవార్త:**

మహిళల సమానత్వం అనేది మన ఇంటి నుండి ప్రారంభం కావాలని, ఇంట్లో మగ పిల్లలను, ఆడపిల్లలు సమానంగా చూడాలని అమీన్‌పూర్ ఎస్ఐ సోమేశ్వరి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున హిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ, అమీన్‌పూర్ ఎస్ఐ సోమేశ్వరి, అడ్వకేట్ నీరజ, డాక్టర్ దీప్తి, నందారం లలిత, నందరం ఉమారాణి, నందార సంబిత లతో పాటు పలువురు ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో పురుషులతో పాటు మహిళలు సమాన హక్కులు కలిగి ఉండాలని, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని వారు కోరారు. ప్రధానంగా అమ్మాయిలు బాగా చదువుకోవడం వల్ల ఆ కుటుంబానికి వెలుగును ఇస్తుందని వారు అన్నారు. మగ పిల్లలను, ఆడ పిల్లలు సమానంగా పెంచాలని, బాల్యం నుంచే ఇంట్లో సమానత్వం పెంపొందించాలని, మగ పిల్లలకు మహిళలను గౌరవించే విధంగా విలువలు నేర్పాల్సిన అవసరం ఎంతో ఉందని వారు అన్నారు. కావున మహిళలందరూ బాగా ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవడం ఎంతో సంతోషకరం అని, ప్రధానంగా ఈ రోజు మహిళలు వారి కాళ్ళ మీద వాళ్లు నిలబడి ఒకవైపు కుటుంబ పోషణ పోషిస్తూ మరోవైపు సమాజంలో తమ బాధ్యతను నడిపిస్తూ ముందుకు వెళ్తున్నారని, కావున మరొకసారి అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన శ్రీనివాస్

**నారాయణఖేడ్, మార్చి 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చాప్టా(కె) గ్రామానికి చెందిన గంగాపురం మోహన్‌రెడ్డి మనవడి కేశఖండన శుభ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు కే శ్రీనివాస్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. శుభకార్యాక్రమానికి హాజరైన శ్రీనివాస్‌ను మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు శాలువాతో సత్కరించారు. శ్రీనివాస్ వెంట నారాయణరెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మైసిగండిలో ఎఐసిసి సెక్రటరీ ప్రత్యేకపూజలు

**కడ్తాల్, మార్చి 9, ప్రభాతవార్త:**

ఎఐసిసి సెక్రటరీ సిడబ్ల్యుసి సభ్యులు చల్లా వంశీచందురెడ్డి స్థానికనాయకులతో ఆదివారం కడ్తాల్ మండలపరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయానికి చేరుకోగా ఆలయ ఈఓ స్నేహలత, ఆలయ ప్రధానఅర్చకులు వారిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వంశిచంద్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు గావించారు. వంశిచంద్‌రెడ్డిని ఆలయ ట్రస్టీ, ఈఓ, ఆలయ అర్చకులు శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలను అందిం చారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, ఆమనల్ బ్లాక్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు యాట నరసింహముదిరాజ్, డిసిసి అధికార ప్రతినిధి గుడురు శ్రీనివాస్‌రెడ్డి, గిరిజననాయకులు హన్మనాయక్, డిసిసి కార్యదర్శి బిక్యనాయక్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిచ్చానాయక్, జగన్, శ్రీశైలం, జోహార్‌లాల్, హిరసింగ్, సత్యం, శంకర్, శ్రీకాంత్, అర్చకులు మాదారం యాదగిరి, ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో పల్లెలు అభివృద్ధి

**పెద్దేముల్, మార్చి 9, ప్రభాతవార్త:**

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో పల్లెలు అభివృద్ధిపథంలో పయనిస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్‌నాయకులు గౌరాల మల్లప్ప అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం బండమీదిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.5లక్షల నిధులతో సిసిరోడ్డు పను లను ప్రారంభించారు. ఈసందర్భంగా మల్లప్ప మాట్లాడుతూ ప్రజాసంక్షే మమే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ పనిచేస్తోందని అన్నారు. సుస్థిరపాలన అందించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెన్నూర్ రాములు, పండరి, రాంచెందర్, చిరంజీవి, నర్సిములు, ఇందిరమ్మకమిటీ మెంబర్ బి.మల్లేష్, జి.పరమే శ్వర్, జి.నరేష్, బి.సంగప్ప, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహించిన టిజిఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

## ఘనంగా శ్రీదుర్గామాత విగ్రహ పునఃప్రతిష్ఠాపన

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 9 ప్రభాతవార్త :** సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 7వార్డు కల్వకుంటలో శ్రీదుర్గామాత విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ బోయిని విజయలక్ష్మి శ్రీశేఖర్, ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదుర్గామాత నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వేదపండితుల సమక్షంలో ఆదివారం ప్రత్యేక పూజలతో దేవతా స్థాపిత పూజ, యంత్రస్థాపిత, శ్రీదుర్గామాత విగ్రహం పునఃప్రతిష్ఠాపన, అనంతరం ద్వజస్థంభం ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించారు . టిజిఐఐసీ చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 3రోజుల పాటు జరిగిన ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొని సహకరించిన స్థానిక కాలనీ పెద్దలకు మహిళలకు భక్తులకు ధన్యవాదములు తెలియచేశారు.

## శ్రీరామేశ్వర వీరాంజనేయ వార్షికోత్సవాలు

**కడ్తాల్, మార్చి 9, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని అన్మాస్‌పల్లిగ్రామ సమీపంలో కొండలమధ్య వెలసిన శ్రీరామేశ్వరవీరాంజనేయక్షేత్రంలో కౌన్సిలర్ గ్రీన్ రివల్యూషన్ వ్యవస్థాప కులు కోర్పోలు లీలాలక్ష్మారెడ్డి దంపతుల అధ్వర్యంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఉదయం లీలాలక్ష్మారెడ్డి దంపతులు, ఆలయ అర్చ కులు యాగశాలప్రవేశం, గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవచనం, మంటపా రాధన, అగ్నిప్రతిష్ఠ, దీపారాధన, పలుపూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు గ్రామ భజనబృందం గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు రావాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్‌కి ఆహ్వానం

**తలకొండపల్లి, మార్చి 9, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండలపరిధిలోని దేవినిపడకల్‌గ్రామంలో ఈనెల13నుంచి నిర్వహించే శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ మాజీ జెడ్పిసి ఉప్పల వెంకటేష్‌కు ఆహ్వానం అందజేశారు. దేవినిపడకల్‌గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రత్యేకంగా ప్రతియేటా నిర్వహిస్తామని, ఉత్సవాలకు రావాలని కోరుతూ శనివారం దేవినిపడకల్ మాజీసర్పంచ్ కడారి శ్రీశైలం ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, తలకొండపల్లి మాజీ ఎంపిపిసిఎల్ శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు శతాబ్ది టౌన్షిప్ అధినేత కాస్ శ్రీనివాస్ రెడ్డితోపాటు మరికొంతమందికి ఆహ్వానం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున ఎద్దులతో గుండెలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నగదుతో కూడిన బహుమతులు అందజేయనున్నట్లు ఈసందర్భంగా తెలియజేశారు. ఆయనవెంట మధు బిక్షపతి కుమార్ రాజు తదితరులున్నారు.

## హనుమాన్‌చాలీసాతో ఆధ్యాత్మికశక్తి పెరుగుతుంది

**-సంస్థ ప్రముఖ్ భాస్కర్**

**పెద్దేముల్, మార్చి 9, ప్రభాతవార్త:**

హనుమాన్‌చాలీసా పారాయణం వల్ల ఆధ్యాత్మికశక్తి పెరుగుతుందని విశ్వ హిందూ పరిషత్ ఏకల్ అభియాన్ సంస్థ ప్రముఖ్ భాస్కర్ అన్నారు. విశ్వహిందుపరిషత్ ఏకల్ అభియాన్ ఆధ్వర్యంలో పెద్దేముల్‌లోని హనుమాన్ దేవాలయంలో ప్రతి ఆదివారం ఉదయం 8గంట లకు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ గత రెండువారాలుగా స్థానిక హనమాన్ దేవాల యంలో పిల్లలు, పెద్దలతోకలిసి సాముహిక హనుమాన్‌చాలీసా పారా యణం నిర్వహించడం జరుగుతుందని, తద్వారా అందరిలో ఆధ్యాత్మికత వెలుగుతుందని, అందరం ఒకటేనటువంటి భావన కలుగుతుందని అన్నారు. పారాయణంవల్ల ఆరోగ్యంగా ఉండటమే కాకుండా పిల్లలకు ఉచ్చారణ కూడా స్పష్టంగా ఉంటుందని అన్నారు. రోజువారి పారాయణం చేయడం వల్ల మానసిక ఒత్తిడిని తగ్గిస్తు ప్రశాంతతను చేకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు మోహన్‌రెడ్డి, విద్యాసాగర్, డివై నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# భానుడి భగభగ.. ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం

**సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 9 ప్రభాతవార్త :** ప్రస్తుత వేసవి సీజన్లో ఎండలు ఎక్కువ కావడంతో, పిల్లల వేడికి ప్రజలు ఉక్కిరి,బిక్కిరవుతున్నారు ఉదయం 9గంటల నుంచే భానుడు భగభగ మండుతుండడంతో రోడ్లన్నీ నిర్మానుషంగా తయారవుతున్నాయి. నిన్న మొన్నటి వరకు చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కగా... ఇక ముమ్ముందు వరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఫిబ్రవరి మాసంలోనే ఇలా ఉంటే ఇక అసలు వేసవికాలం అయిన ఏప్రిల్ మే మాసాల్లో ఎండలు ఏ విధంగా ఉంటాయో అని వాతావరణ నిపుణులు భయపడుతున్నారు.

**పెరుగుతున్న విద్యుత్ వినియోగం, ఫ్యాన్లు ఎసిలకు పెరిగిన గిరాకీ...**

సహజంగా మార్చ్, ఏప్రిల్ నెలల్లో ఫ్యాన్లు ఏసీలు ఆన్ చేయవలసిన అవసరం ఏర్పడేది కానీ గత వారం రోజులుగా పెరుగుతున్న ఎండ తీవ్రతకు ఉక్కబోతలు భరించలేక ప్రజలు ఫ్యాన్లు ఏసీల దుమ్ము దులుతున్నారు. ఏసీలు, ఫ్యాన్లు లేనివాళ్లు అప్పుడే కొత్త ఏసీలు కొనుగోలు గోలు చేస్తుండడంతో ఏసీల షాపులు కల కలలాడుతున్నాయి... ఏసీలు ఫ్యాన్లు ప్రజలు ఎక్కువగా వాడటంతో విద్యుత్తు వినియోగం కూడా గణనీయంగా పెరుగుతుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు. అత్యధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు వడుతున్నారు.

**ఎండలతో ఉక్కిరిబిక్కిరి....**

మార్చి నెలలోనే భానుడు భగ్గుమంటున్నాడు. దీంతో ఉష్ణోగ్రతలు పెండ్లిళ్ల సీజన్ ఉండడంతో ప్రజలు తలకు టవల్, కర్చీఫ్, టోపీలు, గొడుగులు ధరించి కనపడుతున్నారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయం సాయంత్రం "వేళలను ఎంచుకుంటున్నారు. ఇప్పుడే ఎండల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయం, సాయంత్రం వేళలను ఎంచుకుంటున్నారు. ఇప్పుడే ఎండల తీవ్రత ఇంత స్థాయిలో ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఉందన్న ఎండల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరి బోండాలు, నిమ్మకాయ నీల్లు, లస్సీలు, పండ్ల రసాలకు గిరాకి పెరిగుతోంది.

**ఏప్రిల్, మేలో ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం...**

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలతో పాటు రోహిణి కార్తె ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తున్నది. ఇప్పటివరకు ఉన్న వాతావరణం వేరు. రానున్న కాలంలో పరిస్థితులు వేరుగా ఉండనున్నాయి. రాత్రిపూట చలి, మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. దినసరి కూలీలు ఉదయం పూటనే పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నంలోగా ఇంటికి చేరుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇక నుంచి మధ్యాహ్నం పూట బయటకి వెళ్లాలంటే తప్పకుండా గొడుగులు వెంట తీసుకువెళ్లాలని చెబుతున్నారు. మరో మూడు నెలలు ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నదని, వడగాలులు వీచే అవకాశాలు ఉన్నట్లు వైద్యనిపుణులు సూచిస్తున్నారు.



వనదుర్గమ్మను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

## వనదుర్గమ్మ చెంత భక్తుల సందడి

**పాపన్నపేట, మార్చి 9, ప్రభాతవార్త:** భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి బోనాలు సమర్పించి ఒడిబియ్యం నింపి కుంకుమార్చన పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇఓ చంద్రశేఖర్ సిబ్బంది రవికుమార్, సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వరుణాచారి, భత్తిని రాజుల సహకారంతో తగు ఏర్పాట్లు చేశారు. భక్తులు అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఎల్ఆర్ఎస్‌పై మాటమార్చడం కాంగ్రెస్‌కు తగదు

**-బిఆర్ఎస్ నేత నామ రవికిరణ్**



మాట్లాడుతున్న నామ రవికిరణ్

**జహీరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** ఎన్నికల ముందు ఓ మాట అధికారం పీఠం ఎక్కాక మరో మాట మాట్లాడం కాంగ్రెస్‌కు తగదని బిఆర్ఎస్ నేత నామ రవికిరణ్ దుయ్యబట్టారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వస్తే ఫ్రీ ఎల్ఆర్ఎస్ అని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ ఫీజు కట్టాలని, మార్చి 31వరకు 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ కట్టాలనడం తగునా అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలన తీరు అర్థం కాక రాష్ట్ర ప్రజలు ఆయోమయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేసేంత వరకు ప్రజలు డబ్బుల కట్టవద్దని, ప్రజలకు మద్దతుగా బిఆర్ఎస్ నిలుస్తుందన్నారు. ఆరు హామీలు అమలు చేయకుండా ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని దుయ్యబట్టారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పడం తధ్యమన్నారు. సమావేశంలో మాజీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు శివప్ప, నాయకులు అప్పిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం దృశ్యం

**కొండాపూర్, మార్చి 9 ప్రభాతవార్త:** మండలంలోని మల్లెపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాల పేగు బంధం కాదు, రక్తబంధం అసలే కాదు, ఎవరు ముడి వేయకుండా ముడిపడిన బంధం ఇది అని, 18 ఏళ్ళ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అన్నారు. పూర్వ విద్యార్థులు ఒకరి నొకరు కలుసుకొని తమ కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఆత్మీయ ప్రేమతో పలకరించుకున్నారు. మధుర జ్ఞాపకాలతో మైమరిచారు. తమ స్కూల్ డెస్ జ్ఞాపకాలతో చిన్నపిల్లల్లా మారి పాటలకు గెంతులేసి ఆనందంలో మునిగి తేలారు. తమకు చదువులు చెప్పిన గురువులను శాలువాలు, పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింలు, సంగమేశ్వర్, గీతాబాయి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**చౌటకూరులో...**



చౌటకూరులో ఆత్మీయ సమ్మేళనం జరుపుకుంటున్న పూర్వ విద్యార్థులు

**చౌటకూర, మార్చి 9, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2006-07 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. 18 సంవత్సరాల తరువాత ఒక చోట కలుసుకున్న విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ రోజును కులాసాగా గడిపారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాజమౌళి, దిగంబర్,రాంచందర్, భీంశంకర్, నారాయణ, సాయిబాబ, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకటేశం, పద్మలత, సర్వారాజ్, ఆకుల రవికుమార్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గణపతి, లింగాగౌడ్, కొల్కూరి లింగమయ్య, నత్తి గోపాల్, మహిపాల్, ప్రవీణ్, శ్వేత, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## దళిత సంఘం సహాయ కార్యదర్శిగా శ్రీదర్

**నారాయణఖేడ్, మార్చి 9, ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన శ్రీధర్ దళిత సంఘం సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినజిల్లా కమిటీకి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితలు సంక్షేమానికి చేసిన హామీలను వెంటనే అముల చేయాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తామని శ్రీధర్ పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**షాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:**

షాబాద్ మండలపరిధిలోని హైతాబాద్‌లో ఉన్న 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఉంటుందని షాబాద్ ఏఈ కోటేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైతాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న లోడు వలన ముందస్తుగా ఎలాంటిసమస్యలు రాకుండా ఉండేందుకు 5ఎంవీఏ పవ ట్రాన్స్ ఫార్మర్‌తీసి 8ఎంవీఏ పవర్‌ట్రాన్స్ఫార్మర్ అమర్చేప్రక్రియ ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.